ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5



ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం | 36.0 26.0

అనంతపురం

జిల్లా వార్తలు

గురువారం 6 జూన్ 2024

సంబరాలు.. సంతోషాలు..



రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులుకు సత్కారం

చారిత్రక విజయం సాధించిన టీడీపీ కూటమి అభ్యర్థులు బుధవారం సంబరాల్లో మునిగిపోయారు. కొందరు ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించారు. విజేతల ఇళ్లకు కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పోటెత్తారు. పూల మాలలు, పుష్పగుచ్ఛాలు, స్వీట్లు తీసుకువెళ్లి విజేతలను సత్కరించారు. తమ గెలుపుకోసం శ్రమించిన పార్టీ శ్రేణులకు విజేతలు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ శ్రేణుల్లో నిస్తేజం అవరించగా.. ఐదేళ్ల తరువాత టీడీపీ నాయకుల నివాసాలు, పార్టీ కార్యాలయాలలో సందడి కనిపించింది.



కౌకుంట్లలో పయ్యావుల కేశవ్‌కు అభినందనలు..



వెంకటాపురంలో పరిటాల సునీతకు కేక్ తినిపిస్తున్న కార్యకర్తలు



గుంతకల్లులో గుమ్మనూరు జయరాంకు శుభాకాంక్షలు..



కళ్యాణదుర్గంలో అక్కదేవతలకు అమిలినేని సురేంద్రబాబు పూజలు



బండారు శ్రావణిశ్రీని సన్మానిస్తున్న పుట్లూరు మండల నాయకులు



అనంత నగరంలో దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు సన్మానం..

అంబికాకు అదిరే మెజార్టీ



అనంతలో అంబికాకు నాయకుల శుభాకాంక్షలు

వైసీపీ అభ్యర్థిపై 1,88,555 ఓట్ల ఆధిక్యం.. తొలిసారి బరిలో దిగినా బంపర్ మెజార్టీ

అనంతపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి తరఫున అనంతపురం పార్లమెంటు స్థానం నుంచి బరిలో దిగిన అంబికా లక్ష్మీనారాయణ భారీ మెజార్టీని సొంతం చేసుకున్నారు. సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణపై 1,88,555 ఓట్ల మెజార్టీతో ఆయన ఘన విజయం సాధించారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు

శంకరనారాయణకు సొంతపార్టీ ఓటర్ల తిరస్కరణ.. తేడా ఇలా..

నియోజకవర్గం	ఎమ్మెల్యే అభ్యర్థులకు	ఎంపీ అభ్యర్థికి	తేడా
రాయదుర్గం	88650	86065	-2585
ఉరవకొండ	80342	81613	-1271
గుంతకల్లు	94874	85680	-9,194
తాడిపత్రి	86024	82714	-3310
శింగనమల	94169	94460	-291
అనంతపురం అర్బన్	80311	66494	-13,817
కళ్యాణదుర్గం	81144	76743	-4401
మొత్తం	6,05,514	5,73,769	-34869

టీడీపీ కూటమి అభ్యర్థికి తిరుగులేని విజయం

శంకర నారాయణకు సొంతపార్టీ ఓట్లూ తక్కువే

ఇద్దరూ శ్రీసత్యసాయి జిల్లావాసులే కావడం గమనార్హం. అంబికా లక్ష్మీనారాయణ టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శిగా ఉన్నారు. వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి శంకర్‌నారాయణ పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే. పార్టీ అధినాయకత్వాల ఆదేశాల మేరకు వీరిద్దరూ అనంతపురం పార్లమెంటు స్థానంలో పోటీ పడ్డారు. అంబికా లక్ష్మీనారాయణది బోయ సామాజికవర్గం. మాలగుండ్ల శంకర్‌నారాయణది కురబ సామాజికవర్గం. ఈ రెండు సామాజికవర్గాలు అనంతపురం పార్లమెంటు నియోజకరవ్గ పరిధిలో బలంగా ఉన్నాయి. అందుకే రెండు పార్టీలూ గెలుపును ఆశించి బరిలో దించాయి. ఎంపీ అభ్యర్థులుగా ఇద్దరూ తొలిసారి పోటీ చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ టీడీపీ కూటమి అభ్యర్థి ఆధిక్యత చాటుకున్నారు. ప్రతి రౌండులోనూ అంబికా హవా కొనసాగింది. అంబికాకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 12,383, మొత్తం ఓట్లు 7,68,245 వచ్చాయి. శంకరనారాయణకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 5,921, మొత్తం ఓట్లు 5,79,690 వచ్చాయి. దీంతో అంబికాకు 1,88,555 ఓట్ల భారీ మెజార్టీ లభించింది. ఇండియా కూటమి తరఫున బరిలో దిగిన కాంగ్రెస్ అభ్యర్థి వజ్జల మల్లికార్జునకు (పాల మల్లి) పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,263, మొత్తం 43,217 ఓట్లు వచ్చాయి. ఇందులో సుమారు సగం అనంతపురం అర్బన్(11,282), గుంతకల్లులో (10,733 ఓట్లు) రావడం గమనార్హం.



వైసీపీలో క్రాస్ ఓటింగ్

వైసీపీ ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర నారాయణకు మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చిన ఓట్ల కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులకు 6,05,514 ఓట్లు రాగా... ఎంపీ అభ్యర్థికి 5,73,769 ఓట్లు వచ్చాయి. ఎంపీ అభ్యర్థికి మొత్తం 34,869 ఓట్లు తగ్గాయి. అనంతపురం అర్బన్‌లో అత్యధికంగా ఎమ్మెల్యే అభ్యర్థి కంటే 13,817 ఓట్లు శంకరనారాయణకు తక్కువగా వచ్చాయి. ఇక్కడ క్రాస్ ఓటింగ్ భారీగా జరిగింది. ఆ తరువాతి స్థానంలో గుంతకల్లు నియోజకవర్గం ఉంది. ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్థికంటే 9,194 ఓట్లు తక్కువగా వచ్చాయి. కళ్యాణదుర్గంలో 4,401, తాడిపత్రిలో 3,310, రాయదుర్గంలో 2,585, ఉరవకొండలో 1,271 ఓట్లు ఎంపీ అభ్యర్థికి తక్కువగా వచ్చాయి. అత్యల్పంగా శింగనమల నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి కంటే 291 ఓట్లు మాత్రమే తగ్గాయి.

అన్ని స్థానాల్లోనూ అంబికా ఆధిపత్యం

నియోజకవర్గం	టీడీపీ	వైసీపీ	అంబికా మెజార్టీ
రాయదుర్గం	126707	86065	40642
ఉరవకొండ	99687	81613	18074
గుంతకల్లు	101428	85680	15748
తాడిపత్రి	111113	82714	28399
శింగనమల	101215	94460	6755
అనంతపురం అర్బన్	100189	66494	33695
కళ్యాణదుర్గం	115523	76743	38780
పోస్టల్ బ్యాలెట్లు	12383	5921	6462
మొత్తం	7,68,245	5,79,690	1,88,555

రెడ్ మార్క్ దందా..!

రాప్తాడులో జగనన్న లే అవుట్ల అమ్మకం

ఒక్కో ప్లాట్‌ను రూ.5 లక్షల వరకూ..

ప్రైవేటు స్థలాలనూ కలిపి కాజేశారట

తోపుదుర్తి సోదరులు.. బినామీలపై ఆరోపణలు

అనంతపురం సిటీ, జూన్ 5: టీడీపీ కూటమి భారీ విజయంతో వైసీపీలోని అక్రమార్కుల్లో గుబులు మొదలైంది. అధికారంలో ఉండగా చేసిన అక్రమాలు బయట పడితే తమ పరిస్థితి ఏమిటని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ జాబితాలో రాప్తాడు తాజా మాజీ ఎమ్మెల్యే, ఆయన సోదరులు, బినామీల పేర్లు వినిపిస్తున్నాయి. రాప్తాడులో టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత విజయం సాధించడంతో తోపుదుర్తి సోదరులు, వారి బినామీలు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. రాప్తాడు జగనన్నకాలనీలో రెడ్‌మార్క్ ఉండే స్థలాలను ప్లాట్‌లుగా విభజించి అమ్మేయడమే దీనికి కారణమని అంటున్నారు. ఒక్కొక్క ప్లాట్‌ను రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు జోరందుకున్నారు. దీనికి తోడు నగర శివారులోని టిడ్కో ఇళ్ల సమీపంలో తోపుదుర్తి సోదరులు తమ అనుకూల వర్గాలకు ప్లాట్‌లను ఇప్పించి, వాటిని సైతం విక్రయించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రాప్తాడులోని మరో జగనన్న కాలనీ విషయంలోనూ రాజకీయం చేశారని, ఒక్క ప్లాట్ కూడా ప్రజలకు ఇవ్వకుండా లే అవుట్ స్థలం మొత్తాన్ని కాజేశారని ప్రచారం జరుగుతోంది.

రెడ్ మార్క్ ఉంటే అమ్మేయడమే..

లే అవుట్ వేసినప్పుడు నిబంధనల ప్రకారం ప్రార్థనా మందిరాలు, పార్కులు ఇతర అవసరాలకు కొంత స్థలాలను వదిలేయాలి. రాప్తాడు మండల పరిధిలోని పండమేర వంక సమీపంలో ఉన్న జగనన్న లే అవుట్‌లో ఇలా వదిలిన స్థలాలపై కన్నేశారు. గుట్టుచప్పుడు కాకుండా ప్లాట్‌లుగా విభజించి అమ్మేశారని సమాచారం. ఒక్కొక్క ప్లాట్ రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు అమ్మినట్లు తెలిసింది. ఈ లే అవుట్‌లో 50 నుంచి 60 ప్లాట్‌లను విక్రయించారని, రూ.3 కోట్లకు వరకు సొమ్ము చేసుకున్నారని సమాచారం. తమకు అనుకూలంగా ఉండే ఓ వైస్ ఎంపీపీ, మరికొందరిని వర్గంగా ఏర్పాటు చేసి ఈ తతంగం నడిపించారని తెలిసింది. వచ్చిన రూ.3 కోట్లను పంచుకోవడంలో విభేదాలు వచ్చాయని, లోలోపల గొడవలు కూడా జరిగాయని సమాచారం. ఈ వ్యవహారం రెవెన్యూ, హౌసింగ్ అధికారుల దృష్టికి వెళ్లిందా.. లేదా అన్న చర్చ జరుగుతోంది. బినామీలు అమ్మిన ప్లాట్‌లకు ఎలాంటి పట్టాలు ఇవ్వలేదని, నగదు తీసుకుని స్థలాలు చూపించారని, ఇళ్లు కట్టుకోవాలని సూచించారని కొన్నవారు అంటున్నారు. తోపుదుర్తి ఓడిపోవడంతో తమ పరిస్థితి ఏమిటని ప్లాట్‌లను కొనుగోలు చేసినవారు ఆందోళన చెందుతున్నారు.




జగనన్న కాలనీ



మూడు ఎకరాలను కాజేశారా..?

తోపుదుర్తి సోదరుల్లో ఒకరు, మండల స్థాయి పదవిలో ఉండే ఇద్దరు కలిసి మూడు ఎకరాలను మింగేశారని సమాచారం. నవరత్నాలు-పేదలందరికి ఇళ్ల పథకం కింద రెవెన్యూ, హౌసింగ్ అధికారులు జేఎన్‌టీయూ సమీపంలోని 3 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. అయితే ఆ భూమి తమదని ఓ వ్యక్తి అప్పట్లో కోర్టుకు వెళ్లాడు. దీంతో ఆ లే అవుట్‌కు బ్రేక్ పడింది. ఆ స్థలాన్నే కాజేశారని అంటున్నారు. రెవెన్యూ అధికారులను వాడుకున్నారో, భూమి హక్కుదారును బెదిరించారో తెలియదని.. ఆ మూడు ఎకరాలను కాజేశారని కొందరు అంటున్నారు. అధికారులను అడిగితే తమకు ఏమీ తెలియదన్నట్లు మౌనం పాటిస్తున్నారు.

జగనన్న లేఅవుట్‌లోని రెడ్ మార్క్ ఉన్న ప్లాట్ల ప్లాన్ ఇలా...



ప్రైవేటు భూములనూ వదల్లేదు..

జగనన్న లే అవుట్‌లోని రెడ్ మార్క్ స్థలాలతోపాటు.. లే అవుట్‌కు అనుకుని ఉన్న ప్రైవేటు భూములను సైతం ప్లాట్‌లలోకి కలిపి అమ్మేశారని ప్రచారం జరుగుతోంది. ఇలా అమ్మేసిన స్థలం అర ఎకరానికి పైగానే ఉందని సమాచారం. రెడ్ మార్క్ ప్లాట్‌లను కొనుగోలు చేసిన వారిలో చాలా మంది ఇప్పటికే ఇళ్లను నిర్మించారని తెలిసింది. స్థలానికి ఖాళీగా ఉంచితే సమస్య వస్తుందని చకచకా నిర్మాణాలు పూర్తి చేశారని అంటున్నారు. అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు, సీకేపల్లి మండలాల పరిధిలో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని, విచారిస్తే బయట పడతాయని పలువురు అంటున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఇద్దరు కూరగాయల వ్యాపారుల మృతి



నాగ భూషణం



ప్రమాద స్థలంలో నాగభూషణం మృతదేహం



హనుమక్క

ఉరవకొండ, జూన్ 5: మండల పరిధిలోని రాకెట్ల గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగభూషణం (52), హనుమక్క (60) అనే ఇద్దరు మృతిచెందారు. రాకెట్ల గ్రామానికి చెందిన వీరిద్దరూ కూరగాయల వ్యాపారులు. ఉరవకొండ కూరగాయల మార్కెట్‌కు నాగభూషణం తన సొంత ఆటోలో బయలుదేరారు. అదే ఆటోలో హనుమక్కను కూడా ఎక్కించుకున్నారు. గ్రామంలో నుంచి మెయిన్ రోడ్డుపైకి రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వీరి ఆటోను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఎదురుగా వస్తున్న హైదరాబాదు-కళ్యాణదుర్గం బస్సును గమనించకుండా ఆటోను మెయిన్ రోడ్డుపైకి తీసుకురావడమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రయాణికులను దించేసి, బస్సును ఉరవకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నాగభూషణానికి భార్య కవిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. హనుమక్కకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి పెద్దలను కోల్పోవడంతో రెండు కుటుంబాలవారు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కూరగాయల వ్యాపారమే వీరికి జీవనాధారం.

వైసీపీని వణికించిన ఓట్లు

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల చుట్టూ కుట్రలు

రికార్డు స్థాయిలో ఓటెత్తిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు

పోలైన ఓట్లు.. 26,962

చెల్లనివి 3,582



అనంతపురంలో మే 4వ తేదీన పోస్టల్ ఓట్ల ఇబ్బందుల గురించి జిల్లా ఎన్నికల అధికారి వినోద్ కుమార్‌కు వివరిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

అనంతపురం టౌన్, జూన్ 5: అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీని పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వణికించాయి. ఊహించినట్లుగానే ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోటెత్తారు. వైసీపీ అభ్యర్థులు సైతం పోస్టల్ బ్యాలెట్ ఓట్లను తగ్గించేందుకు తీవ్రంగానే ప్రయత్నించారు. ఓట్లను ఇన్‌వ్యాలీడ్ చేయించేందుకు కోర్టులకు ఎక్కారు. అన్ని అడ్డంకులను దాటుకుని.. పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు రికార్డు స్థాయిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయినా, ఇన్ వ్యాలీడ్ ఓట్లు భారీగానే నమోదయ్యాయి. జిల్లాలో మొత్తం 3,582 పోస్టల్ ఓట్లు చెల్లలేదు.

అడుగడుగునా అడ్డంకులు

పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు ఈ ఎన్నికల్లో అనేక అవాంతరాయలు ఎదురయ్యాయి. వైసీపీ అభ్యర్థులు చాలాచోట్ల ప్రలోభాలకు దిగారు. కొన్నిచోట్ల బెదిరించారు. ఆర్వోల పైనా తీవ్రంగా ఒత్తిడి తెచ్చారనే ప్రచారం సాగింది. దీంతో టీడీపీ కూటమి నాయకులు, ఉపాధ్యాయులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఫెసిలిటీ కేంద్రాల్లో పేర్లు కనిపించకపోవడం, సరైన సమాచారం ఇవ్వకపోవడం వంటి అంశాలను ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎన్నికల కమిషన్ స్పందించింది. ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంతర్‌జిల్లా ఉద్యోగులు, అత్యవసర సేవలు అందించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించింది. దీంతో జిల్లా చరిత్రలో ఎన్నడూ లేనన్ని పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 26,962 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారు.

వేలాదిగా ఇన్‌వ్యాలీడ్

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో 23,380 ఓట్లు మాత్రమే చెల్లాయి. 3,582 ఓట్లు ఇన్‌వ్యాలీడ్ అయ్యాయి. గుంతకల్లు నియోజకవర్గంలో 3,612 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో 2,890 ఓట్లు లెక్కింపునకు అర్హత సాధించాయి. అత్యధికంగా 722 ఓట్లు ఇన్‌వ్యాలీడ్ అయ్యాయి. శింగనమల నియోజకవర్గంలో 2,450 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ కాగా.. 1,856 ఓట్లు చెల్లాయి. 594 ఓట్లు చెల్లలేదు. రాప్తాడు నియోజకవర్గంలో 4,338 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ కాగా, 3,773 ఓట్లు చెల్లాయి. 565 ఓట్లు చెల్లలేదు. రాయదుర్గంలో 1,671 ఓట్లకుగాను 1,518 చెల్లాయి. 382 ఓట్లు ఇన్‌వ్యాలీడ్ అయ్యాయి. తాడిపత్రిలో 2,702 ఓట్లకుగానూ 2,275 ఓట్లు చెల్లాయి. 487 చెల్లలేదు. ఉరవకొండలో 2,544 ఓట్లకుగానూ 2,162 ఓట్లు చెల్లాయి, 282 ఓట్లు చెల్లలేదు. అనంతపురం అర్బన్‌లో అత్యధికంగా 6,971 ఓట్లు పోల్ అయ్యాయి. 6,557 ఓట్లు చెల్లాయి. 414 ఓట్లు మాత్రమే ఇన్‌వ్యాలీడ్ అయ్యాయి. కళ్యాణదుర్గంలో 2,614 ఓట్లకుగాను 2,349 ఓట్లు చెల్లాయి. 265 ఓట్లు చెల్లలేదు.

‘ఎవరు గెలిచినా మీదే గెలుపు’

లక్కీడ్రాలో విజేతల ఎంపిక



ఆంధ్రజ్యోతి అనంతపురం యూనిట్ కార్యాలయంలో విజేతల ఎంపిక

అనంతపురం కల్చరల్, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎవరు గెలిచినా మీదే గెలుపునకు సంబంధించి బుధవారం ఆంధ్రజ్యోతి జిల్లా కార్యాలయంలో లక్కీడ్రా నిర్వహించారు. నలుగురు విజేతలను ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా 5వేల మంది కూపన్లలో వివరాలు నమోదు చేసి ఆంధ్రజ్యోతి కార్యాలయానికి పంపారు. 14 నియోజక వర్గాలకు 14 ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని 151 మంది నమోదు చేశారు. మొదటిస్థానంలో ఒకరిని, ద్వితీయ స్థానంలో ముగ్గురిని విజేతలుగా లక్కీడ్రాలో ఎంపిక చేశారు. మొదటిస్థానంలో నిలిచిన విజేతకు రూ.10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విజేతలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అనంతపురం బ్రాంచ్ మేనేజర్ జీ గోపాల్‌నాయుడు, బ్యూరో ఇన్‌చార్జి వెలుగు రామకృష్ణుడు, ఏబీఎన్ స్టాఫర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేనేజర్ మారుతీ ప్రసాద్, ఏసీఎం నారాయణస్వామి నాయక్, అసిస్టెంట్ మేనేజర్ రమేష్‌బాబు, టెక్నికల్ ఇన్‌చార్జి నవీన్ పాల్గొన్నారు.

విజేతల వివరాలు

మొదటి బహుమతి

నరావుల రామప్ప, డో.నెం.12/1/369, అశోక్‌నగర్, అనంతపురం

ముగ్గురికి ద్వితీయ బహుమతి

ఎం. నాగేంద్రరావు, డో.నెం.20/34-సి3, హనుమేష్ నగర్, గుంతకల్లు, అనంతపురం జిల్లా.

ఎం.క్రిష్ణవేణి, భర్త : నాగలింగేశ్వర్, బూర్నకుంట, పెద్దవడుగూరు (మం), అనంతపురం జిల్లా.

షేక్ మజీద్ సాబ్, డో.నెం. 17-6-234, న్యూ హస్నాబాద్, హిందూపురం (మం), శ్రీసత్యసాయి జిల్లా

అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టారు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మీడియాతో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, జూన్ 5: అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. బుధవారం స్థానిక రామ్‌నగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు వడ్డే అంజినప్పతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్డీయూ కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో ప్రజలు గెలిపించారన్నారు. దేశంలోనే బలమైన పార్టీగా టీడీపీ అవతరించిందన్నారు. జగన్, వైసీపీ నేతల అహంకారం, సైకో విధానాలను భరించలేక అన్ని వర్గాల ప్రజలు వైసీపీని కూకటివేళ్లతో పెలికించారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, పార్టీ రథసారధి నారాలోకేశ్‌పై నమ్మకంతో ప్రజలు ఈ తీర్పునిచ్చి ఏపీలో స్వర్ణయుగానికి బీజం వేశారన్నారు. ఉమ్మడి అనంత జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాలు, రెండు ఎంపీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించేందుకు కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి అనంత జిల్లాను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవళ్ల మురళీ, సుధాకర్ యాదవ్, కురుబ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన పోలీసులు, మాట్లాడుతున్న ఎస్పీ



అందరికీ థ్యాంక్స్

ఎస్పీ గౌతమిశాలి

అనంతపురం క్రైం, జూన్ 5: ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు భద్రతా చర్యలు చేపట్టిన ప్రతి ఒక్కరికీ జిల్లా ఎస్పీ గౌతమిశాలి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మంగళవారం కౌంటింగ్ బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు సిబ్బంది, కేంద్ర, రాష్ట్ర బలగాలతో బుధవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో ఎస్పీ సమావేశమయ్యారు. అందరూ సమష్టిగా కష్టపడటం వల్లే కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. ఎన్నికల్లో ఆఖరు, కీలకఘట్టమైన కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడం శుభపరిణామమన్నారు. ఇదే స్ఫూర్తితోనే మరికొన్ని రోజులు శ్రమించి జిల్లాను ప్రశాంతంగా ఉంచుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది కేంద్ర, రాష్ట్ర బలగాల పోలీసులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 5: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అనంతపురం, ఉరవకొండ, బెళుగుప్ప, బొమ్మనహాల్ మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. కూడేరు, పామిడి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

అదనపు విత్తన వేరుశనగ కోసం ప్రతిపాదనలు

అనంతపురం అర్బన్, జూన్ 5: జిల్లాకు 12,500 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం జిల్లా వ్యవసాయ యంత్రాంగం రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు ప్రతిపాదనలు పంపారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాకు 76 వేల క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారు. ఇప్పటి దాకా జిల్లా వ్యాప్తంగా 67 వేల క్వింటాళ్ల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో ఇప్పటి వరకు 56 వేల మంది రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు మండలాల్లో విత్తన వేరుశనగ కోసం డిమాండ్ పెరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాకు అదనంగా మరో 12,500 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించాలని ప్రతిపాదనలు పంపారు.

ఇంక ఊపిరి పీల్చుకోవచ్చు

జేఎన్‌టీయూ నుంచి ఎన్నికల సామగ్రి తరలింపు

10 నుంచి తరగతుల ప్రారంభం

వర్సిటీ సిబ్బందికి తప్పిన భద్రత బెడద



ఇనుప బారికేడ్లను లోడ్ చేస్తున్న కార్మికులు



కంటైనర్‌లో ఈవీఎంలు

అనంతపురం సెంట్రల్, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల ఘట్టం ముగియడంతో జేఎన్‌టీయూ వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి. మే నెల ఆరంభం నుంచే ఎన్నికల నిర్వహణాధికారులు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని కొన్ని భవనాలను స్వాధీనం చేసుకున్నారు. కళాశాల ప్రధాన భవనం, ఎన్‌టీఆర్ ఆడిటోరియం, ఈసీఈ బిల్డింగ్, వర్సిటీ పాత పరిపాలనా భవనాల్లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్‌కు రెండు వారాల ముందు నుంచి కట్టుదిట్టమైన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. జేఎన్‌టీయూ అధికారులు, సిబ్బందిని సైతం ఐడీ కార్డులుంటేనే లోపలికి అనుమతించారు. ఈ క్రమంలో భద్రత మధ్యనే వారు విధులు నిర్వహించారు. కౌంటింగ్‌కు ముందు వర్సిటీ పరిసరాలను రెడ్‌జోన్‌గా ప్రకటించి మరింత నిఘాపెంచారు. మంగళవారం కౌంటింగ్ ముగియడంతో బుధవారం జేఎన్‌టీయూ నుంచి ఎన్నికల సామగ్రిని తరలించడం ప్రారంభించారు. రెవెన్యూ, విద్యాశాఖ, నగరపాలక సంస్థ సిబ్బంది తరలింపులో నిమగ్నమయ్యారు. వర్సిటీ పరిసరాలను కార్మికులతో శుభ్రం చేయించారు.

10 నుంచి తరగతులు

ఎన్నికలను పురస్కరించుకుని జేఎన్‌టీయూ విద్యార్థులకు సెలవులు ప్రకటించారు. కౌంటింగ్ ముగియ డంతో 10నుంచి యథావిధిగా తరగతులు ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. 17నుంచి బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం తరగతుల విద్యార్థులకు వివిధ సమయాల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. దీంతో ఓవైపు పరీక్షలు, మరోవైపు తరగతులు ఇలా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వ్యత్యాసాలను సరిదిద్ది మూడు సంవత్సరాల విద్యార్థులకు ఒకేసారి తరగతులు, పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు.

తండ్రిని మించిన ఆధిక్యం

రికార్డు మెజార్టీ సాధించిన జేసీ అశ్మిత్‌రెడ్డి



తాడిపత్రిటౌన్, జూన్ 6: తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ విజయంతో మెజార్టీలో తండ్రిని మించిన తనయుడిగా జేసీ అశ్మిత్‌రెడ్డిని కొనియాడుతున్నారు. రాష్ట్రంలోనే ఓ ప్రత్యేకత సంతరించుకున్న నియోజకవర్గ ఫలితంపై రాష్ట్ర ప్ర జలు ఎంతో ఆసక్తి కనబరిచారు. ఎందుకంటే మూ డేళ్ల కిందట జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రమం తా ఫ్యాన్ హవా చూపినా తాడిపత్రిలో మాత్రం సైకిల్ జోరు చూపించింది. దీంతో ఈ సెగ్మెంట్‌పై అందరి చూపు పడింది. అందరూ అనుకున్న విధంగానే టీడీపీ జోరు చూపించి జేసీ అశ్మిత్‌రెడ్డి ఘనవిజయం సాధించాడు. దీనివెనుక జేసీ ప్రభాకర్‌రెడ్డి, జేసీ అశ్మిత్‌రెడ్డిలు పడిన కష్టం అంతాఇంతా కాదు. వైసీపీ ప్రభుత్వం పెట్టిన ఎన్నో ఇబ్బందుల ను అధిగమిస్తూ నిత్యం ప్రజల్లోనే ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

జేసీ ఫ్యామిలీకి కంచుకోట

40ఏళ్లుగా జేసీ ఫ్యామిలీకి తాడిపత్రి కంచుకోటగా ఉంది. ఈ ఫ్యామిలీ నుంచి జేసీ దివాకర్‌రెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందాడు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. కానీ వీరికి రికార్డు మెజార్టీ ఎప్పుడూ రాలేదు. ఆ లోటును జేసీ అశ్మిత్‌రెడ్డి తీర్చాడు. 1951లో ఏర్పడిన తాడిపత్రి నియోజకవర్గంలో ఇంత వరకు ఎన్నడూ రాని రీతిలో జేసీ అశ్మిత్‌రెడ్డి 29068ఓట్ల మెజార్టీ సాధించాడు. తాడిపత్రి నియోజకవర్గంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా జేసీ సోదరులు గెలిచేవారు. కానీ 2019లో జరిగిన ఎన్నికల్లో ఫ్యాన్ హ వాలో మొదటిసారి టీడీపీ తరఫున పోటీచేసిన జేసీ అశ్మిత్‌రెడ్డి ఓటమిపాలయ్యారు. కానీ ఆయన ఏమాత్రం నిరాశపడలేదు. ఎక్కడ ఏ పొరపాటు జరిగిందో విశ్లేషించుకున్నారు, చిన్నచిన్న లోపాలను సరిదిద్దుకొని ఉవ్వెత్తున కెరటంలా లేచి నిలబడి ప్ర స్తుత ఎన్నికల్లో విజయం సాధించాడు. దీంతో జేసీ ఫ్యామిలీ మొత్తం సంబరాల్లో మునిగిపోయింది.

నెరవేరిన జేసీపీఆర్ కల

తాడిపత్రిలో మున్సిపల్ ఛైర్మన్‌గా జేసీ ప్రభాకర్ రెడ్డి ఉంటున్నారు. తన కుమారుడు జేసీ అశ్మిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా చూడాలన్నది ఆయన కల. అది ప్రస్తుత ఎన్నికల్లో నెరవేరడంతో ఆయన ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. తాను మున్సిపల్ ఛైర్మన్ కాగా తన కుమారుడు ఎమ్మెల్యే అని అందరికి చెప్పుకుంటూ మురిసిపోతున్నాడు. అభివృద్ధిలో తండ్రిని మించి చేయాలని జేసీ అశ్మిత్‌రెడ్డి కసిగా ఉన్నట్లు తెలుస్తోంది. ముందుగా తాడిపత్రిలో అస్తవ్యస్తంగా ఉన్న అండర్ డ్రైనేజీ సమస్యను గాడిలో పెట్టేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. తాడిపత్రికి రాకముందే ఇప్పటికే ఒక్కొక్క సమస్యను పరిష్కరించేందుకు ఆయన కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది.

బదిలీల పేరుతో రూ.లక్షలు వసూలు

సర్దుబాటంటూ బుకాయింపు

కోడ్ ఉల్లంఘనే అంటున్న ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 5: బదిలీల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక్కో ఉద్యోగి నుంచి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వసూలుకు శ్రీకారం చుట్టారు. ఓ వైపు సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ యథేచ్ఛగా ఏపీఎంలను బదిలీ చేయడంపై సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కోడ్ ఉల్లంఘిస్తూ డీఆర్‌డీఏ-వైకేపీలో సుమారు 13మంది ఉద్యోగులను బదిలీలు చేయడం గమనార్హం. పరిపాలనా సౌలభ్యం కోసం సర్దుబాటు చేశామంటూ బుకాయిస్తున్నారు. విడపనకల్లు, బెళుగుప్ప మండలాల ఏపీఎంలకు ప్రమాదం జరగడంతో ఇదే అదనుగా అనుకూలంగా ఉన్న పెద్దవడుగూరు, ఉరవకొండ ఏపీఎంలను ఇక్కడికి బదిలీ చేశారు. ఇలా సుమారు 13మందిని ఉద్యోగులను బదిలీ చేస్తూ కోడ్ ఉల్లంఘించారు. ఈ బదిలీలకు సంబంధించి ఒక్కో ఉద్యోగి నుంచి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుండడంతో తమ అనుయాయులైన ఉద్యోగులను నచ్చిన ప్రాంతాలకు బదిలీ చేయడానికి ఓ అర్జీతో పాటు ముడుపులు పుచ్చుకుంటున్నట్లు ఆ శాఖలో చర్చించుకుంటున్నారు.

వసూళ్ల బాధ్యత ఆ ఇద్దరికే..

ఉద్యోగుల బదిలీలకు అడ్వాన్సుగా వసూలు చేసి మిగిలిన ముడుపులు వసూలు చేసే బాధ్యతను ఇద్దరు ఉద్యోగులకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇందులో ద్వితీయ శ్రేణి అధికారి, తృతీయ శ్రేణి ఉద్యోగి ఉన్నట్లు సమాచారం. ఉద్యోగుల వినతితో పాటు అమ్యామ్యాలు తీసుకోవాలని ఇప్పటికే హుకుం జారీ చేశారు. ఇక వాహన సదుపాయం కోసం ఓ ఏరియా కోఆర్డినేటర్ (ఏసీ)గా రెగ్యులర్ ఉంటూ. మరో సబ్జెక్ట్‌కు డీపీఎంగా వ్యవహరిస్తున్నారు. సీనియర్ డీపీఎంలు ఉన్నప్పటికీ ఏసీకి అదనంగా ప్రాజెక్ట్‌లో ఓ యాంకర్ పర్సన్‌గా నియమించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఆ ఏసీ క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ కింది స్థాయి ఉద్యోగులతో నిత్యావసర సరుకులు, కూరగాయలు, ఇతర సరుకులు తెచ్చుకుంటున్నట్లు తోటి ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఈ అధికారికి పెద్ద ఎత్తున వంతపాడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల కోడ్ అమలులో ఉండగా బదిలీలు

సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉండగా బదిలీలు చేయడం దుమారం రేపుతోంది. విషయాన్ని బయటకు పొక్కకుండా ముడుపులు పుచ్చుకుని బదిలీలు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఎన్నికల కమిషనర్ అనుమతి లేకుండా ఎటువంటి బదిలీలు చేపట్టరాదు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ తమకు నచ్చిన వారికి బదిలీలు చేయడం తీవ్రచర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే బదిలీల కోసం వినతులు, ముడుపులు పుచ్చుకుని వ్యవహారం నడుపుతున్నట్లు సమాచారం. ఎన్నికల కోడ్ ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేలోపు బదిలీలకు రూ.లక్షల్లో వసూలు చేసి జేబులునింపుకునే పనిలో డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు నిమగ్నమయ్యారు.

సర్దుబాటు చేశామంతే

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉద్యోగుల సౌకర్యార్థం కొందరికి సర్దుబాటు చేశాం. విడపనకల్లు, బెళుగుప్ప ఏపీఎంలకు ప్రమాదం జరగడంతో సమీపంలోని ఏపీఎంలకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించాం. ఇందులో ఎటువంటి ఉద్దేశ్యం లేదు. ప్రధానంగా ఉద్యోగుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటాం. జిల్లా అధికారులు, సెర్ప్ అధికారుల అనుమతితోనే ఏపీఎంల సర్దుబాటు చేశాం. పరిపాలనలో భాగంగానే ఏపీఎంలను బదిలీ చేశాం. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బదిలీలు చేపట్టరాదు.

- నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ

పోల్ పోస్టుమార్టం

బూత్‌లవారీగా పరిశీలించే

పనిలో అభ్యర్థులు

కిందిస్థాయి నాయకుల

పనితీరుపై బేరీజు

పార్టీ వ్యతిరేకులను

గుర్తించేందుకు యత్నం



హిందూపురం, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు పోల్ పోస్టుమార్టం చేస్తున్నారు. పోలైన ఓట్ల జాబితా ఆధారంగా ఏ బూత్‌లో ఎన్ని ఓట్లు అనుకూలంగా పడ్డాయి. ఎన్ని వ్యతిరేకంగా వేశారన్న లెక్కలు వేసే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. ఎన్నికల బరిలో నిలిచి అపజయం పాలైన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఈ కసరత్తు ప్రారంభించారు. తమ అపజయానికి ఏ బూత్, ఏ వార్డు, పంచాయతీలు కారణమోనని గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు నియోజకవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. కూటమి అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేశారు. వైసీపీ బోణీ కూడా కొట్టలేక బోల్తాపడింది. ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించాలని కోట్లాది రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అపజయానికి వాస్తవాలు వెలుగులోకి తెచ్చే పనిలో పడ్డారు. ఎన్నికలు పురస్కరించుకుని ప్రధాన పార్టీల అభ్యర్థులు వారి నియోజకవర్గంలో బూత్‌ల వారీగా ఇన్‌చార్జిలను ఏర్పాటు చేసుకుని, ప్రచారం సాగించారు. రెండు నెలలపాటు ఇన్‌చార్జిలకు అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చి, ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. అంతేకాక నియోజకవర్గంలో అధికారంలోకి వచ్చిన పార్టీ అభ్యర్థి ఐదేళ్లలో కార్యకర్తలు, నాయకులను కాపాడుకునేందుకు ఏకంగా రూ.10కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. ఎందుకంటే ఆ నియోజకవర్గంలో క్లస్టర్ ఇన్‌చార్జి, బూత్ కన్వీనర్లను ఏర్పాటు చేసుకున్నారు. వారికి ఏడాదిగా నెలనెలా వేతనం ఇస్తూ పార్టీ కార్యక్రమాలు చురుగ్గా చేయించారు. వీరుకాకుండా ప్రధాన పార్టీలకు కొన్ని సర్వే బృందాలు ఆరు నెలలుగా లక్షలాది రూపాయలు తీసుకుంటూ పనిచేశాయి. ఇంతా చేసినా కొన్ని వార్డుల్లో ప్రధాన పార్టీలకు ఎదురుగాలి తప్పలేదు. దీంతో ఇన్ని రకాలు ఖర్చుచేసినా ఓట్లు రాకపోవడం ఏంటని గుర్తించే పనిలో అభ్యర్థులు తలమునకలవుతున్నారు. పెద్దఎత్తున ఖర్చు చేసినప్పటికీ అనుకూలంగా ఫలితాలు రాకపోవడంతో పోల్ పోస్టుమార్టం చేసుకుని తమకు పోలైన ఓట్లు వ్యతిరేకంగా లెక్కలు చూస్తున్నారు. ఇన్‌చార్జిలలో ఎవరు, ఏమేరకు పనిచేశారో పోలైన ఓట్ల ఆధారంగా తేలే అవకాశం ఉంటుంది.

కొందరిలో ఆందోళన

అభ్యర్థులు ఈ కసరత్తు ప్రారంభించినట్లు తెలుసుకుని బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలతోపాటు మండల కన్వీనర్లలో కూడా ఆందోళన మొదలైంది. వారికి కేటాయించిన బూత్‌లలో తక్కువ ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే తాము పెద్ద అపవాదు మోయాల్సి వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కసరత్తుతో పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలు పనితనం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుంది. తాము నియమించిన ఇన్‌చార్జిలు ఏ మేరకు ప్రచారం చేశారనేది స్పష్టం అవుతుంది. అభ్యర్థి సమకూర్చిన అన్ని రకాల సౌకర్యాలు పొంది కొన్నిచోట్ల ప్రత్యర్థికి పని చేశారా అన్న వాస్తవం ఈ పోల్ పోస్టుమార్టంలో బహిర్గతమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇన్నిరకాల వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉండటంతో కిందిస్థాయి ఇన్‌చార్జిలు, క్లస్టర్ బాధ్యులు ఆందోళన చెందుతున్నారు. బూత్‌ల ఇన్‌చార్జిలతోపాటు వాటి పరిధిలో ఉన్న కిందిస్థాయి నాయకులు సైతం అపజయం పాలైన అభ్యర్థిని కలిసేందుకు ముఖం చాటేస్తున్నట్లు సమాచారం. ఆయా రాజకీయ పార్టీల నుంచి బరిలో నిలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రచారంకంటే ఎక్కువగా ప్రత్యర్థి అనుచరులను కొనుగోలు చేయడంపై కొన్ని నియోజకవర్గాల్లో దృష్టిపెట్టారు. తమ చుట్టూ ఉన్నవారంతా మేలుకోరేవారనే అభద్రతతో ఉన్నారంటే కొనుగోళ్లు ఏమేరకు సాగాయో అర్థం చేసుకోవచ్చు. ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.3వేల దాకా పంచినా ఓడిపోవడంపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలుస్తుంది. మొత్తంగా పోల్ పోస్టుమార్టంతో కిందిస్థాయి నేతలు, పార్టీ శ్రేణులు.. వారి పార్టీ అభ్యర్థుల కోసం ఏమేరకు పనిచేశారో తేటతెల్లమయ్యే అవకాశం స్పష్టంగా ఉంది. దీంతో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారి జాతకాలు బయటపడనున్నాయి.

క్రాస్ చేశారు..!

బీకే పార్థసారథికి 1,32,427 ఓట్ల మెజార్టీ



పుట్టపర్తి, జూన్5 (ఆంధ్రజ్యోతి): హిందూపురం పార్లమెంటు స్థానానికి కూటమి తరఫున పోటీ చేసిన బీకే పార్థసారథి 1,32,427 ఓట్ల మెజార్టీ సాధించారు. హిందూపురం పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ కలుపుకుని 7,25,534 ఓట్లు కైవసం చేసుకున్నారు. వైసీపీ అభ్యర్థి శాంతకు 5,93,107 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి సమద్ షాహీన్‌కు 55,059 ఓట్లు దక్కాయి. స్వతంత్ర అభ్యర్థుల్లో ప్రతాప్‌రెడ్డికి 5444, నోటాకు 17,971 ఓట్లు పడ్డాయి. పోస్టల్ బ్యాలెట్‌లో కూటమి అభ్యర్థి బీకే పార్థసారథికి 12,521, శాంతకు 5,701, కాంగ్రెస్ అభ్యర్థికి 1,070 ఓట్లు దక్కాయి. కాంగ్రెస్‌కు మడకశిరలో 15,469, హిందూపురంలో 13,018, కదిరిలో 8,319 ఓట్లు లభించడం విశేషం. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థి బీకే పార్థసారథికి, ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చిన ఓట్లలో తేడా కనిపించింది. ధర్మవరం, మడకశిరలో ఎమ్మెల్యే అభ్యర్థుల కంటే అధిక మెజార్టీ వచ్చింది.

ఎన్ఎంఎంఎస్‌కు

209 మంది ఎంపిక

అనంతపురం విద్య, జూన్ 5: జాతీయ ఉపకార వేతనాలు పొందేందుకు అనంతపురం జిల్లా నుంచి 209 మంది విద్యార్థులు ఎంపికైనట్లు డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబరు మూడో తేదీన నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో ఫలితాల వివరాలు ఉన్నాయన్నారు. జిల్లా నుంచి ఎంపికైన 209 మంది విద్యార్థులు తమ మెరిట్ కార్డులు త్వరలో సంబంధిత స్కూళ్లకు పంపుతారన్నారు. ఆ విద్యార్థులు ఏదైనా జాతీయ బ్యాంకులో విద్యార్థి పేరున సేవింగ్స్ ఖాతా ఓపెన్ చేయించుకుని, తండ్రి లేదా తల్లిని జాయింట్ చేసుకుని విద్యార్థి ఆధార్ నెంబర్‌కు అకౌంట్‌కు లింక్ చేయించుకోవాలన్నారు. జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ త్వరలోనే నేషనల్ స్కాలర్ షిప్‌పోర్టల్‌ను ప్రారంభిస్తుందన్నారు. పోర్టల్ ఆరంభమైన వెంటనే ఎంపికైన విద్యార్థులు తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

చీనీకాయలు టన్ను రూ.40 వేలు

అనంతపురంరూరల్, జూన్ 5: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.40 వేలు, కనిష్ఠంగా రూ.16 వేలు, సరాసరి రూ.25 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 408 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టీడీపీ వర్గీయులపై కేసు నమోదు

యాడికి, జూన్ 5: మండలంలోని రాయలచెరువులో టపాసులు కాల్చి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని టీడీపీ వర్గీయులు 35 మందిపై కేసు నమోదుచేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత టీడీపీ వర్గీయులు జాతీయ రహదారిపైకి వచ్చి టపాసులు కాల్చారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, 6వ తేదీ వరకు టపాసులు కాల్చడం నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలను టీడీపీ నాయకులు ఉల్లంఘించారని తెలిపారు. దీనిపై స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ దామోదర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుమేరకు 35 మందిపై కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు.

పోలీసుల అదుపులో

హత్యకేసు నిందితులు?

ధర్మవరం, జూన్ 5

ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్ హత్యకేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. హిందూపురానికి చెందిన సంపత్‌కుమార్‌ను మే 30వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేసి, శవాన్ని ధర్మవరం చెరువు సమీపంలో కంపచెట్లలో పడేసిన విషయం తెలిసిందే. ఈ హత్యకేసును పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, పోలీసు సిబ్బంది నిందితులకోసం ముమ్మర గాలింపు చేపట్టారు. బుధవారం సాయంత్రం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలుస్తోంది. ఎవరు, ఎందుకు హత్య చేయించారనే కోణంలో విచారణ చేపట్టారు. దర్యాప్తు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే వివరాలు వెల్లడించే అవకాశాలున్నాయి.

ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ రాజీనామా

అనంతపురం కల్చరల్, జూన్ 5: ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల రాజీనామా చేశారు. మాల్యవంతం మంజుల తన భర్త ఓబులేసుతో కలిసి బుధవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి, ఆర్టీసీ యాజమాన్యానికి తన రాజీనామా లేఖను పంపినట్లు వెల్లడించారు.



దగ్గుపాటి ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

దగ్గుపాటికి శుభాకాంక్షల వెల్లువ

అనంతపురం అర్బన్, జూన్ 5 : అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించిన దగ్గుపాటి ప్రసాద్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బుధవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయానికి భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. టీడీపీ నాయకులు సరిపూటి రమణ, నారాయణ స్వామి యాదవ్, కుంచెపు వెంకటేష్, పోతుల లక్ష్మీనరసింహులు, రాయల్ మురళీ, సుధాకర్ యాదవ్, రాజారావు, బాబాఫక్రుద్దీన్, పీఎం లక్ష్మీప్రసాద్, నెట్టెం బాలకృష్ణ, కురబ నారాయణస్వామి, సంగా తేజస్విని, విజయశ్రీరెడ్డి, నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ... నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషి ఫలితంగానే భారీ మెజార్టీతో విజయం సాధించడం జరిగిందన్నారు. అలాగే టీడీపీ నాయకులు షౌకత్ ఖాన్, మహబూబ్ బాషా, నూర్ బాబా తదితరులు దగ్గుపాటి ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న షౌకత్ ఖాన్, మహబూబ్ బాషా, నూర్ బాబా

పీటీసీ వాకర్స్ సన్మానం



అనంతపురం కల్చరల్ : విజయం సాధించిన ప్రజా ప్రతినిధులకు పీటీసీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నాయకులు అభినందనలు తెలిపారు. బుధవారం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కల్యాణ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబులను వారి నివాసాల్లో పీటీసీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌బాబు, ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, వీజీ లోకనాథ్, వైపీ రమణ, రమేష్, తిమ్మప్ప పాల్గొన్నారు.



అభినందిస్తున్న ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ముస్లింలు

అలాగే ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను బుధవారం ఆయన నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జాకీర్, ఇస్మాయిల్, షెక్షా, హసేన్, నూర్ పాల్గొన్నారు.



దగ్గుబాటికి శుభకాంక్షలు తెలుపుతున్న పెండ్యాల శ్రీలత

అనంతపురం ప్రెస్‌క్లబ్: కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణల స్వగృహాలకు వెళ్లిన ఆమె వారిద్దరికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి పెండ్యాల చక్రపాణి, వీర మహిళలు శైలజ, లక్ష్మి, గాయత్రి, వరలక్ష్మి, నాయకులు విశ్వనాథ్, మహబూబ్ ఖాన్, శంకర్, సంజయ్ పాల్గొన్నారు.

నీట్‌లో టీచర్ కూతురి సత్తా



సత్యహారిక

అనంతపురం విద్య, జూన్ 5 : నీట్‌లో అనంతపురం నగరానికి చెందిన విద్యార్థి కరణం సత్యహారిక సత్తా సాటింది. నీట్ పరీక్షల్లో 720 మార్కులకు గాను 636 మార్కులు సాధించింది. తల్లిదండ్రులు కరణం సత్యప్రసాద్, సత్యకళ. తండ్రి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విద్యార్థిని 8వ తరగతి వరకూ అనంతపురంలో సత్యపబ్లిక్ స్కూల్‌లో చదివింది. 9,10 తరగతులు శ్రీచైతన్య స్కూల్‌లో చదివింది. ఇంటర్ విజయవాడలో చదివింది. నీట్ ఫలితాల్లో 98.16 పర్సెంటెయిల్ సాధించింది. ఆలిండియా స్థాయిలో 41,961 ర్యాంకు దక్కించుకుంది.

అభిమానులతో వెంకటాపురం కిటకిట

పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌కు పలువురి శుభాకాంక్షలు



వెంకటాపురంలో మాట్లాడుతున్న పరిటాల సునీత



మలేసియాలో సంబరాలు

రామగిరి, జూన్ 5: పరిటాల సునీత నాలుగోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి బుధవారం స్వగ్రామం వెంకటాపురానికి చేరుకోవడంతో ఆమెకు శుభాకాంక్షలు తెలిపేందుకు జనం పోటెత్తారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావడంతో వెంకటాపురం కిటకిటలాడింది. బీజేపీ, సీపీఐ నాయకులతోపాటు ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా వేలాదిమంది తరలివచ్చారు. ఎన్‌ఎస్ గేటు నుంచి వెంకటాపురం వరకు వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అభిమానుల తాకిడి తగ్గలేదు. పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను సత్కరించారు. వచ్చిన ప్రతి ఒక్కరిని వారు ఆప్యాయంగా పలకరించారు. ఇలవేల్పు యల్లమ్మ ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, ఆ తరువాత అంతా కలిసిమెలసి ఉండాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

మలేసియాలో టీడీపీ నేతల సంబరాలు

అనంతపురంరూరల్ : సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, రాప్తాడు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి పరిటాల సునీత గెలుపుతో మండలంలోని టీడీపీ నాయకులు మలేసియాలో సంబరాలు జరుపుకున్నారు. కక్కలపల్లి కాలనీ పంచాయతీ నందమూరినగర్ యూనిట్ ఇన్‌చార్జ్ రంగనాయకులు ఇతర నాయకులు పార్టీ జెండా ఆవిష్కరించి, కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సునీతను వెంకటాపురంలో మండల టీడీపీ నాయకులు దండోర రమణ కలిసి.. శుభాకాంక్షలు తెలి పారు. పరిటాల శ్రీరామ్‌ను సత్కరించారు.



పరిటాల సునీత, శ్రీరామ్‌ను అభినందిస్తున్న నాయకులు

టీడీపీకి కంచుకోటగా నిలిచిన రామగిరి

రామగిరి : ఎన్నికల్లో ఎప్పుడూ రామగిరి టీడీపీకి కంచుకోటగానే నిలుస్తోంది. ఊహించని విధంగా మండలంలో 6,644 ఓట్ల మెజారిటీ వచ్చింది. మండలంలో 32 బూత్‌లు ఉండగా కేవలం ఎంసీపల్లిలో 215 బూత్‌లో వైసీపీ 21 ఓట్లు మెజారిటీ రాగా 231 బూత్‌లో పోలేపల్లి, చెర్లోపల్లిలో ఆరు ఓట్లు మెజారిటీ వచ్చాయి. మిగిలిన 30బూత్‌లలో వంద ఓట్లకు తగ్గకుండా మెజారిటీ వచ్చింది. ప్రతి పంచాయతీ నుంచి కూడా వందలసంఖ్యలో మెజారిటీ రావడంతో 6,644 మెజారిటీ సాధించింది. 225 బూత్‌లోని నసనకోట, వెంకటాపురంలో 510 ఓట్లకు 496 ఓట్లు టీడీపీకి మెజారిటీ వచ్చింది.





అంబికాకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఆవుల కృష్ణయ్య

అంబికాకు పలువురి శుభాకాంక్షలు

అనంతపురం అర్బన్, జూన్ 5: అనంతపురం పార్లమెంట్ ఎంపీగా విజయం సాధించిన అంబికా లక్ష్మీనారాయణను పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం అనంతపురం నగరశివారులోని ఆయన నివాసంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య, ఆవుల శ్రీనివాసులు, ఆంజినేయులు, శ్రీధర్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకాశ్‌రెడ్డీ... అరమీసం ఎప్పుడు తీయిస్తావ్..?

రామగిరి, జూన్ 5: ప్రకాశ్‌రెడ్డి తాను ఎమ్మెల్యేగా గెలవకపోతే అర మీసం తీయించుకుంటానని సవాల్ విసిరారని, ఇక ఎప్పుడు తీయించుకుంటారని టీడీపీ మండల నాయకులు ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా పరిటాల సునీత విజయం సాధించడంతో బుధవారం టీడీపీ స్థానిక కార్యాలయంలో కేక్ కట్ చేసిన వారు మాట్లాడారు. గతంలో దొంగ ఓట్లతో గద్దెనెక్కి ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెట్టారనీ, అందుకే తగిన విధంగా బుద్ధి చెప్పారని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రామ్మూర్తి నాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, తెలుగు యువత అధ్యక్షుడు లింగా శ్రీధర్‌నాయుడు, మాజీ ఎంపీపీ పరంధామ యాదవ్, ఎస్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ శీనా, పేపర్ శీనా, అక్కులప్ప, పోతన్న, దుబ్బార్లపల్లి వెంకటేష్, ఓబులపతి, పోలేపల్లి చంద్రప్ప, ప్రభాకర్, ఎంపీటీసీ శ్రీనివాసులు, పేరూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు వెంకటేశ్, రామాంజినేయులు, వడ్డేసుబ్బు మల్లికార్జున పాల్గొన్నారు.



రామగిరి టీడీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

వైసీపీ కోటకు బీటలు

అనంతపురంరూరల్, జూన్ 5: అనంతపురం రూరల్ మండలం మొదటి నుంచి వైసీపీకి కంచు కోట. గత ఎన్నికల్లోను 10,159 ఓట్లు వైసీపీకి పడ్డాయి. ఈ నేపథ్యంలో ఈసారి కూడా వైసీపీ కొంత మెజార్టీ వస్తుందని ఇరు పార్టీల వారూ అభిప్రాయపడ్డాయి. వైసీపీ ఆరువేల నుంచి 7వేల మధ్య మెజార్టీ ఉంటుందని భావించారు. ఓటర్లు వైసీపీ శ్రేణుల నమ్మకంపై నీళ్లు చల్లారు. టీడీపీ ఊహించిన దానికంటే రెట్టింపులో ఓట్లు వేశారు. ఈ క్రమంలో టీడీపీ మండలంలో ఆరువేలకు పైగా మెజార్టీని దక్కించుకుంది. ఇందులో టీడీపీ శ్రేణుల కష్టం చాలానే ఉంది. పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సఫలీకృతమైయ్యారు.

6,139 ఓట్ల మైజార్టీ

మండలంలోని 21 పంచాయతీల్లో 88 పోలింగ్ కేంద్రాలున్నాయి. 2019 ఎన్నికల్లో టీడీపీకి 22,717 ఓట్లు రాగా.. వైసీపీకి 32,896 ఓట్లు పడ్డాయి. దీంతో టీడీపీకి 6,139 ఓట్ల మెజార్టీ దక్కింది. గత ఎన్నికల్లో వైసీపీ మండలంలో 10,179 ఓట్ల మెజార్టీ దక్కింది. ఈసారి ఎన్నికల్లో మాత్రం టీడీపీ శ్రేణులు వైసీపీ వారికంటే ఎక్కువగా కష్టపడ్డారు. ఇందుకు ఆయా గ్రామాల్లో టీడీపీ పడ్డ ఓట్లే ఇందుకు నిదర్శనం. వైసీపీ గట్టిపట్టున్నా ప్రాంతాల్లో కూడా టీడీపీ వారు ఓట్లను వేయిచుకోగలిగారు.

క్రిష్ణంరెడ్డిపల్లి, పాపంపేట, సోములదొడ్డి, కొడిమి, రాచానపల్లి, సిండికేట్‌నగర్, కక్కలపల్లి కాలనీ, కాట్నేకాలువ, ఉప్పరపల్లి, పూలకుంట, కందుకూరు ప్రాంతాల్లో ఓట్లు వేయించుకున్నారు. పాపురాయి, నరసనాయునికుంట, చిన్నంపల్లి, మన్నిలా ప్రాంతాల్లో ముందు నుంచి టీడీపీకి పట్టుంది. దాన్ని అలానే నిలబెట్టుకోగలిగారు. మరికొన్ని ప్రాంతాల్లో గట్టిపోటినించి వైసీపీ మైజార్టీలో తగ్గించడంలో సఫలమైయ్యారు. దీంతో ఈ సారి మండలంలో టీడీపీకి 33,189 ఓట్లు పడ్డాయి. వైసీపీకి 27,050ఓట్లు వచ్చాయి.

కూటమి విజేతలకు ఆలం శుభాకాంక్షలు



నార్పల, జూన్ 5: శింగనమల నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ భారీ మెజార్టీతో గెలవడంతో వారిని టీడీపీ జిల్లా నాయకుడు ఆలం వెంకటనరసానాయుడు, నాయకులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులను చేపట్టాలని అకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బండారు శ్రావణికి స్వగ్రామంలో ఘన స్వాగతం



సిద్దరాంపురంలో శ్రావణిశ్రీకి స్వాగతం పలుకుతున్న అభిమానులు

బుక్కరాయసముద్రం, జూన్ 5: బండారు శ్రావణీశ్రీకి తన సొంత గ్రామమైన సిద్దరాంపురంలో బుధవారం ఘన స్వాగతం లభించింది. ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారిగా ఆమెతో పాటు కుటుంబ సభ్యులు కలిసి బుధవారం ఉదయం తన స్వగ్రామమైన సిద్దరాంపురం గ్రామానికి వెళ్లారు. తన తాత సమాధి వద్ద నివాళలర్పించారు. అనంతరం గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఆమె వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, పసుపుల నారాయణరెడ్డి ఉన్నారు.



బండారు శ్రావణిశ్రీకి అభినందనలు తెలుపుతున్న దేగల కృష్ణమూర్తి

శింగనమల : శింగనమల కూటమి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ విజయం సాధించడంతో నియోజకవర్గంలో టీడీపీ కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి అభినందలు తెలిపారు. బుధవారం అనంతపురంలోని బండారు శ్రావణిశ్రీ ఇంటి వద్దకు పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, మారుతి నాయడు, గుత్తాఆదినారాయణ, చిదనందనాయుడు, చితంబరి దొర, గుర్రం లక్ష్మినారాయణ, సత్తి నగముని బండి వెంకటనారాయణ, ఎర్రిస్వామి మాసూలచంద్ర అనీల్ రహితుల్లా తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

నేతల ఇళ్లలో సందడి

గార్లదిన్నె, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో విజేతల ఇళ్లు కిటకిటలాడాయి. బుధవారం మండలంలోని కల్లూరు, ఇల్లూరు, పెనకచర్ల, కోటంక, క్రిష్ణపురం, కొప్పలగొండ తదితర గ్రామాల నుంచి టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున నగరంలోని ఎంపీ, ఎమ్మెల్యే ఇళ్లకు చేరుకున్నారు. ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టూమెన్ కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గేట్ క్రిష్ణరెడ్డి, గుర్రం ఆదినారాయణ, ఆవుల క్రిష్ణ, ఇల్లూరు రామాంజి, సుంకా, వస్పూరు, గుత్తా బాలక్రిష్ణ, రామచంద్ర, బాబయ్య, అంజి గంగాధర్ వడ్లరాము, వెంకటేష్, సుబ్బయ్య, శీన, రామాంజి పాల్గొన్నారు.

శింగనమలలో పట్టు నిలుపుకున్న టీడీపీ

బుక్కరాయసముద్రం, జూన్ 5: శింగనమల నియోజకవర్గంలో మరోసారి టీడీపీ పట్టు నిలుపుకుంది. 2019 ఎన్నికలో భారీ ఓటమిని చవిచూసిన టీడీపీ శ్రేణులు నియోజకవర్గంలో ఈ సారి సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నేతలు కలిసి కట్టుగా పనిచేసి విజయం సాధించారు. ముఖ్యంగా ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీతో పాటు ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డిలుతో పాటు నియోజకవర్గంలోని రాష్ట్ర, జిల్లా కమిటీ నేతలతో సమన్వయం చేసుకుని ఎన్నికలలో గెలుపుకు కీలకంగా వ్యవహరించారు. గత 2019 ఎన్నికలలో 46,345 ఓట్లు వైసీపీ గెలుపొందిన విషయం తెలిసిందే. ఆ మెజార్టీని పూడ్చి... తిరిగి టీడీపీ అభ్యర్థి శ్రావణిశ్రీకి 8,788 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

ఆ నాలుగు మండలాల్లో టీడీపీ అధిక్యం : శింగనమల నియోజకవర్గంలో బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, నార్పల, శింగనమలలో టీడీపీ అధిక్యం వచ్చింది. గత ఎన్నికలలో లాగే ఈ ఏడాది పుట్లూరు, యల్లనూరు మండలాల్లో వైసీపీ అభ్యర్థికి మెజార్టీ దక్కింది. ఈ నాలుగు మండలాల్లో టీడీపీ అత్యధికంగా బుక్కరాయసముద్రం మండలంలో 6,995 ఓట్లు మెజార్టీ రాగా... ఒక మేజర్ గ్రామ పంచాయతీలోనే 3700 ఓట్లు మెజార్టీ రావడంతో టీడీపీకి కలిసి వచ్చింది. గార్లదిన్నె మండలంలో 3250పైగా మెజార్టీ వచ్చింది. శింగనమలలో 1987 ఓట్లు, నార్పల మండలంలో 1692 ఓట్లు మెజార్టీ వచ్చింది. వైసీపీ పట్టుకొమ్మ అయిన నార్పల మండలంలో సార్వత్రిక ఎన్నికలలో ద్విసభ్యకమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు టీడీపీకి మెజార్టీ రావడంతో ఆలం సోదరులు పట్టునిలుపుకున్నారు. పుట్లూరు మండలంలో 1,596 వైసీపీకి మెజార్టీ, యల్లనూరు మండలంలో 3,162 ఓట్లు వైసీపీకి వచ్చాయి.

శింగనమలలో మూడోస్థానంలో బీఎస్పీ

శింగనమల జూన్ 5: శింగనమల నియోజకవర్గంలో టీడీపీ మొదటి, వైసీపీ రెండు స్థానాల్లో నిలువగా... బీఎస్పీ అభ్యర్థి మందరం గౌతమి మూడో స్థానంలో నిలిచారు. టీడీపీ కూటమి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీకి 1,02,957, వైసీపీ అభ్యర్థికి వీరాంజినేయలుకు 94,168, బీఎస్పీ అభ్యర్థి మందర గౌతమికి 3896 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి శైలజానాథ్‌కు 3469 ఓట్లు రావడంతో నాలుగో స్థానం దక్కింది.

కారు బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

శింగనమల, జూన్ 5: శింగనమల తహసీల్దార్ శోభన్‌బాబు కారు బోల్తా పడింది. బుధవారం అనంతపురంలో ఉన్న తహసీల్దార్ తన కారును డ్రైవర్ షైఖిల్‌కు ఇచ్చి శింగనమల తహసీల్దార్ కార్యాలయానికి పని నిమిత్తం పంపాడు. అనంతపురం నుంచి శింగనమలకు ఆ కారు వస్తుండగా... సెంటల్ జైలు సమీపంలోని అనంత విద్యానికేతన్ పాఠశాల వద్ద కారు యాక్షల్ కట్ అయింది. దీంతో కారు డివైడర్‌కు ఢీకొని బోల్తా పడింది. చక్రం కట్ కావడంతో కారు ఎగసిపడింది. కారు డ్రైవర్ షైఖిల్ సల్ప గాయలతో బయటపడ్డారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

అనంతపురం కల్చరల్, జూన్ 5: జాతీయ బహుళార్థక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సంగమేష్ నగర్ 80 అడుగుల రోడ్డులోని కేయస్ఏఆర్ గఫూర్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య శిబిరంలో అన్నిరకాల వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా వైద్య చికిత్సలందిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పవన్ కల్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 5: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా నేతలు క్షీరాభిషేకం నిర్వహించారు. బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శులు ధనుంజయ్య, జయమ్మ, సిద్దు, అవుకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షులు సదానందం, జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యం

అనంతపురం న్యూటౌన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవడం ద్వారానే అది సాధ్యమని జిల్లా అటవీ శాఖాధికారి వినీత్ కుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురష్కరించుకొని జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పంపనూరులో ఉన్న నగర వనంలో స్థానిక సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. స్థానిక బీట్ ఆఫీసర్ దామోదర్, ఏబీఓ రామ్మోహన్ పాల్గొన్నారు.

అనంతపురం క్రైం: జిల్లా న్యాయసేవల అథారిటీ ఆధ్వర్యంలో జిల్లాకోర్టులో పర్యావరణంపై అవగాహన కల్పించారు. శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ శ్రీనివాసరావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ హాజరయ్యారు. అనంతరం జిల్లా కోర్టు ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇటికె నల్లప్ప, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కిషోర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

అనంతపురం క్లాక్‌టవర్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల నుంచి తెలుగుతల్లి విగ్రహం, అంబేద్కర్ విగ్రహం, సప్తగిరి సర్కిల్ వరకు గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి, డీఐసీ జీఎం నాగరాజు, ఏఎఫ్ ఎకాలజీ కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ, నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, జిల్లా కోర్టు అధికారి నల్లప్ప, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, డీసీఎస్ ఆనంద్‌భాస్కర్, పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిశోర్‌కుమార్ రెడ్డి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.





పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ చేస్తున్న అధికారులు, కోర్టు ఆవరణంలో మొక్కలు నాటిన న్యాయమూర్తులు

కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలపై అవగాహన

అనంతపురం టౌన్, జూన్ 5: కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షల నిర్వహణపై వైద్యశాఖ కార్యాలయంలో బుధవారం అవగాహన తరగతులు నిర్వహించారు. ఇందులో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ. దేవి మాట్లాడుతూ.. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో గ్రామాలకు వెళ్లి ప్రత్యేకంగా కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేపట్టాలని రాష్ట్ర శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. అందులో భాగంగా విలేజ్‌హెల్త్ క్లినిక్‌ల స్థాయిలో సీహెచ్‌సీ వైద్యులు, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు ఫ్యామిలీ డాక్టర్ పథకంలో కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షలు పక్కాగా నిర్వహించాలనే ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రవికుమార్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్: జిల్లా అండర్-19 క్రికెట్ మహిళా జట్టు ఎంపిక చేసినట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో బుధవారం తెలిపారు. ఎంపికైన జట్టులో.. అర్షియా, హస్నిరెడ్డి, నందిని, నేహ, అమూల్య, గౌతమి, రిప్య, దీపిక, నాగజ్యోతి, సుమియా, స్రవంతి, అంకాల్‌యాదవ్, సమీనా బేగం, తరుణం, తేజశ్రీతో పాటు స్టాండ్‌బైలుగా హిమవర్షిణి, నిత్యరెడ్డి ఉన్నారు. కోచ్‌గా కుమార్ నియమితులయ్యారు. ఎంపికైన జట్టు శుక్రవారం నుంచి నెల్లూరు జిల్లా వెంకటగిరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటుంది.



జిల్లా అండర్-19 మహిళా క్రికెట్ జట్టు

ఎమ్మెల్యే కేశవ్‌ను కలిసిన టీడీపీ నాయకులు



పయ్యావుల కేశవ్‌కు పూలమాల వేస్తున్న నాయకులు

విడపనకల్లు, జూన్ 5: ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ గెలుపొందటంతో మండలంలోని 19 గ్రామాల టీడీపీ నాయకులు బుధవారం కౌకుంట్ల గ్రామానికి వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఒక్కొక్క గ్రామం నుంచి దాదాపుగా నాలుగు ఐదు వాహనాలలో జనం తరలి వెళ్లారు. బాణసంచాలు కాల్చుతూ సంబరాలు నిర్వహించారు. అనంతరం కేక్‌ను కట్ చేయించి టీడీపీ విజయంపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు సర్పంచ్‌లు చంద్రశేఖర్, తిమ్మరాజు, తిప్పారెడ్డి, జనార్ధననాయుడు, బీడీ మారయ్య, సినిమా రామాంజినేయులు, హనుమంతు, భీమలింగప్ప, పాపారాయుడు, విజయ్‌శెట్టి, రవీంద్ర, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేశవ్ ఇంటి వద్ద కోలాహలం

ఉరవకొండ: మండలంలోని కౌకుంట్లలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఇంటి వద్ద బుధవారం కోలాహలం నెలకొంది. శాసనసభ ఎన్నికల్లో కేశవ్ గెలుపొందారు. దీంతో నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు కౌకుంట్లకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో మారయ్య, సుంకరత్నమ్మ, కొర్రా వెంకటమ్మ, తులసీదాస్‌నాయక్, కాలువ మారయ్య, కంద్యాల నారాయణస్వామి, భీమలింగ, హనుమంతు, గడేకల్లు శ్రీన, పాల్గొన్నారు. ఎంపీగా గెలిచిన అంబికా లక్ష్మీనారాయణను కడమలకుంట సర్పంచ్ సుదీప్ పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

గుమ్మనూరు జయరాంకు సన్మానం

గుంతకల్లు, జూన్5: ఎన్నికల్లో విజయం సాధించి గుంతకల్లుకు వచ్చిన గుమ్మనూరు జయరాంను పార్టీ కార్యకర్తలు, అభిమానులు సన్మానాలతో ముంచెత్తారు. బుధవారం ఉదయం గుంతకల్లుకు రాగా పాతగుంతకల్లు వద్ద నుంచి అడుగడుగునా కార్యకర్తలు అడ్డుకుని కిందకు దించి దండలు, శాలువలతో ఘనంగా సన్మానించారు.

చంద్రబాబు విజయంపై జితేంద్రగౌడు వేడుక

ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంపై మాజీ శాసనసభ్యుడు జితేంద్రగౌడు తన క్యాంపు కార్యాలయంలో వేడుకను నిర్వహించారు. కేక్‌ను కట్‌చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, తన అనుచరులకు మిఠాయిని పంచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీ కేశప్ప, శివన్న, ముక్కన్నగారి రామాంజి, రాయల్ వెంకటేశులు పాల్గొన్నారు.

కూటమి విజయంతో శ్రేణుల సంబరాలు



అంకాల్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

గుత్తి, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో గుంతకల్లు నియోజకవర్గం కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం ఎమ్మెల్యేగా విజయం సాధించడం పట్ల టీడీపీ శ్రేణులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ బీసీ సంఘం ఫెడరేషన్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్ స్వగ్రామంలో బాణసంచా కాల్చి కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. అదేవిధంగా ఎన్డీఏ కూటమి ఘనవిజయంతో స్థానిక గాంధీ సర్కిల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. సాయంత్రం బీజేపీ కర్నూలు జిల్లా ఇన్చార్జి, రాష్ట్ర నాయకులు అంకాల్‌రెడ్డిని స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆయనకు పూలమాలు వేసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాసులు, బాలకృష్ణ, నారాయణ, మనోజ్‌కుమార్, తిమ్మారెడ్డి, మనోహర్, రంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రిటౌన్, జూన్5: ఐటీఐలో ప్రవేశాలకు 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ మంతేసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10లోపు దరఖాస్తుతోపాటు సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. కళాశాలలో కోపా, మెకానిక్ డీజల్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 18నుంచి 26వరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు ఎలాంటి కాల్‌లెటర్స్ పంపిమని తెలిపారు.

ఇది కార్యకర్తల విజయం



పామిడిలో మాట్లాడుతున్న గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి

పామిడి, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో గుంతకల్లు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం గెలుపు కార్యకర్తల విజయమని గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడారు. టీడీపీని ఆదరించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బొల్లు శ్రీనివాసరెడ్డి, గౌస్‌పీరా, జింకల సంజీవకుమార్, నల్లబోతుల శ్రీనివాసులు, చెన్నవరం మహబూబ్‌బాషా, ముసలిరెడ్డి, శ్రీరాములు, శివారెడ్డి, సుంకప్ప, షేక్షావలి, ఓబులేసు, చంద్రాచారి పాల్గొన్నారు.

దుర్గంలో అమిలినేనికి ఘన స్వాగతం



సురేంద్రబాబుకు స్వాగతం పలికేందుకు వేచి చూస్తున్న మహిళలు

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 5: అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన తర్వాత కళ్యాణదుర్గానికి తొలిసారి వచ్చిన అమిలినేని సురేంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. పట్టణానికి బుధవారం ఆయన దాదాపు 500 వాహనాల భారీ కాన్వాయ్‌తో వచ్చారు. తొలుత పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించుకుని బయలుదేరారు. గ్రామగ్రామాన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికి, భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. పట్టణానికి తలమానికంగా ఉన్న అక్కమ్మగార్ల దేవాలయానికి చేరువవుతుండగా భారీ వర్షం కురిసింది. దాన్ని సైతం లెక్క చేయకుండా ప్రజలు, కార్యకర్తలు ఆయన వెంట నడుస్తూ దేవాలయంలో పూజలు నిర్వహించి 101 టెంకాయలు కొట్టారు. అనంతరం పట్టణానికి చేరుకోవడంతో టీ సర్కిల్‌లో భారీ గజమాలలతో స్వాగతం పలికారు. అడుగడుగునా డప్పు వాయిద్యాలతో నృత్యాలతో ఘనంగా ఆయన్ను స్వాగతించారు. ప్రజావేదిక వద్ద భారీఎత్తున టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ పట్టణ ఓట్లకు గండి కొట్టిన టీడీపీ

గుంతకల్లు, జూన్ 5: గత ఎన్నికల్లో వైసీపీకి 20 వేల పైచిలుకు ఆధిక్యాన్నిచ్చిన గుంతకల్లు పట్టణం ఈ ఎన్నికల్లో కేవలం 1,668 ఓట్ల లీడ్‌ను మాత్రమే ఇవ్వడంతో ఆ పార్టీ అభ్యర్థికి ఓటమి ఎదురైంది. 26వ పోలింగ్ బూత్ మొదలుకుని 131వ బూత్ వరకూ గుంతకల్లు పట్టణంలో 106 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. వాటిలో వైసీపీకి 36,757 ఓట్లు రాగా, టీడీపీకి 35,089 ఓట్లు వచ్చాయి. ఈ మేరకు వైసీపీకి 1,668 ఓట్ల అధిక్య మాత్రమే లభించింది. ఎన్నో ఆశలు పెట్టుకున్న వైసీపీ అభ్యర్థికి, నాయకుల ఆశలకు ఈ ఫలితం అశనిపాతంలా పరిణమించింది. గుంతకల్లు మండలంలో టీడీపీకి 17,337 ఓట్లు రాగా వైసీపీకి 14,822 ఓట్లు లభించాయి. దీంతో గుంతకల్లు మండలంలోని గ్రామాలలో 2,515 ఓట్ల ఆధిక్యం లభించింది. గుంతకల్లు పట్టణం, మండలం కలిపి టీడీపీకి 847 ఓట్ల ఆధిక్యం లభించింది. ఇక గుత్తి పట్టణం, మండలం పూర్తిగా టీడీపీ పక్షాన నిలబడ్డాయి. గుత్తి పట్టణంలో టీడీపీకి 14,161 ఓట్లు రాగా, వైసీపీకి 12,295 ఓట్లు లభించాయి. దీంతో టీడీపీకి 1,874 ఓట్ల అధిక్యం వచ్చింది. గుత్తి రూరల్‌లో 14,861 ఓట్లు టీడీపీకి రాగా, వైసీపీకి 12,264 ఓట్లు లభించగా, టీడీపీకి 2,597 ఓట్లు లబ్ధి చేకూరింది. అదేవిధంగా పామిడి పట్టణంలో 7,514 ఓట్లు టీడీపీకి, 6,647 ఓట్లు వైసీపీకి రాగా, 867 ఓట్ల ఆధిక్యం టీడీపీకి లభించింది. పామిడి మండలంలో 10,981 ఓట్లు టీడీపీకి, 11,070 ఓట్లు వైసీపీకి లభించాయి. దీంతో పామిడి మండలంలో వైసీపీకి 89 ఓట్ల ఆధిక్యం చేకూరింది. ఈవీఎంల ద్వారా జరిగిన పోలింగ్‌లో మొత్తంమీద టీడీపీకి 6,095 ఓట్లు వైసీపీ కంటే అదనంగా లభించాయి. పోస్టల్ ఓట్లు 730 ఓట్ల ఆధిక్యాన్ని కలుపుకుని టీడీపీకి మొత్తం మీద 6,828 ఓట్ల మెజారిటీ వచ్చింది.

వైద్యుల తీరుపై డీపీఎంఓ ఆగ్రహం

బొమ్మనహాళ్, జూన్ 5: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీపీఎంఓ రవిశంకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుబాటులో ఉండి రోగులకు సరైన వైద్యం అందించడం లేదని ప్రవర్తన మార్చుకోవాలని మండిపడ్డారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని డీపీఎంఓ రవిశంకర్ తెలిపారు. ముందుగా రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందితో స్థానిక ప్రజారోగ్య సమస్యలపై ఆరాతీశారు. ఇంటింటా సర్వే సక్రమంగా నిర్వహించి ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితులను నమోదు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో కాన్పులు ఎక్కువగా జరిగేలా చూడాలన్నారు. గోవిందవాడ గ్రామంలో 8 నెలల గర్భిణి మృతికి గల కారణాలను మృతురాలి రికార్డు వివరాలు పరిశీలించి, తెలుసుకున్నారు. సకాలంలో వైద్యం ఎందుకు అందించలేదని అంబులెన్స్‌లో సిబ్బంది, ఆశ వర్కర్లను ప్రశ్నించారు. ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉంటూ వైద్యం అందించాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని ప్రవర్తన మార్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి రఫీయా సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి వృద్ధుడికి గాయాలు

పెద్దవడుగూరు, జూన్5: మండలంలోని మొలకతాళ్ల గ్రామంలో బుధవారం గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటనలో వృద్ధుడు మునెప్ప తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు మునెప్ప బయటకు వెళ్లే సమయంలో తన నివాస గృహంలో ఉన్న గ్యాస్ స్టవ్‌ను ఆఫ్ చేయడం మర్చిపోయాడు. దీంతో ఇల్లంతా గ్యాస్ వ్యాపించింది. ఇంటికి వచ్చిన మునెప్ప తలుపులు తెరిచి వెలుతురు కోసం కొవ్వొత్తిని వెలిగించడానికి అగ్గిపుల్ల వెలిగించాడు. అంతే ఒక్కసారిగా పెద్ద శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో మునెప్ప తీవ్రగాయాలపాలయ్యాడు. మునెప్పను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రిటౌన్, జూన్5: పట్టణంలోని నందలపాడులో గల ఆదర్శపాఠశాలకు సంబంధించి 7, 8, 9 తరగతుల్లోని ఖాళీసీట్లకు జూన్ 12లోపు దరఖాస్తు చేసుకోవాలనిప్రిన్సిపాల్ లావణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామన్నారు. మెరిట్, రోస్టర్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పోలీసుల కవాతు

పెద్దవడుగూరు, జూన్5: మండలకేంద్రంలోని ప్రధాన రహదారుల్లో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కవాతులో సిబ్బంది, స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

కూటమి విజయంతో టీడీపీ సంబరాలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

బెళుగుప్ప, జూన్ 5: కూటమి విజయంతో బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు జరుపుకు న్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షులు పెద్ద తిప్పయ్య నాయకులు వన్నూరుస్వామి, వెంకట్రామిరెడ్డి, కంచిరాముడు, శివశంకర స్వామి, నాగరాజులు కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఏ సమస్య వచ్చినా కార్యకర్తకు అండగా ఉంటామని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.

అంత మెజారిటీ ఎలా వచ్చిందబ్బా !

ఆత్మశోధనలో వైసీపీ నాయకులు

బెళుగుప్ప, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో మండలంలో టీడీపీకి ఊహించని మెజారిటీ రావడంతో వైసీపీ నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీకి పట్టున్న గ్రామాల్లో కూడా టీడీపీకే మెజారిటీ వచ్చింది. ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామాంజనేయులు స్వగ్రామం దుద్దేకుంటలో వైసీపీకి మండలంలోనే అత్యధిక మెజారిటీ వస్తుంది. గత ఎన్నికలలో 400 మెజారిటీ రాగా ఈ ఎన్నికలలో 96 ఓట్లు టీడీపీకి మెజారిటీ వచ్చింది. ఈ గ్రామంలో మెజారిటీపై ఇరు పార్టీల వారు లక్షల్లో బెట్టింగు వేశారు. గత ఎన్నికల్లో మండల కన్వీనర్ మచ్చన్న, సొంత ఊరు విరుపాపల్లిలో వందకు పైగా వైసీపీకి మెజారిటీ రాగా ప్రస్తుతం 71 ఓట్ల మెజార్టీ టీడీపీకి వచ్చింది. మొత్తం మీద నాయకుల సమష్టి కృషితో టీడీపీకి మండలంలో 4773 మెజారిటీ లభించింది.

గోడకూలి విద్యార్థికి గాయాలు

కణేకల్లు, జూన్ 5: మండల కేంద్రంలోని పాత గురుకుల పాఠశాల వద్ద బుధవారం గోడకూలి తరుణ్(16) అనే విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. గురుకుల పాఠశాల ఆవరణంలో పాత బిల్డింగ్‌లు శిథిలావస్థలో ఉండగా తరుణ్ అక్కడకు వెళ్లి నిల్చున్నప్పుడు అకస్మాత్తుగా గోడకూలి కాలిపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతని తండ్రి శివరుద్ర తరుణ్‌ను హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కాలవకు ఓట్ల సునామీ

రాయదుర్గం, జూన్ 5: కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన కాలవ శ్రీనివాసులు రికార్డు విజయం సాధించారు. రాయదుర్గం పట్టణం ఆది నుంచి తెలుగుదేశం పార్టీ కంచుకోటగా ఉంది. 2004 నుంచి ఇప్పటివరకు టీడీపీకే మెజార్టీ ఇస్తూనే వచ్చింది. 2014లో 10వేల దాకా, 2019లో ఐదువేల దాకా, 2024లో 16వేల మెజార్టీని రాయదుర్గం పట్టణం తెలుగుదేశంకు ఇచ్చింది. దీంతో ఇప్పటివరకు రాయదుర్గం చరిత్రలో ఎవరికీ రాని మెజార్టీ కాలవ శ్రీనివాసులుకు దక్కింది. మొత్తంగా 41,659 మెజార్టీతో చరిత్ర సృష్టించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో మెజార్టీపైనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా వైసీపీ శ్రేణులు కణేకల్లు మండలంలో వచ్చే మెజార్టీతో రాయదుర్గం పట్టణంను సరి చేయవచ్చని భావిస్తూ వచ్చారు. చివరకు కణేకల్లు మండలం కూడా తెలుగుదేశంకు మెజార్టీ ఇవ్వడంతో వారి అంచనాలు తలకిందులయ్యాయి. ఇప్పటివరకు రాయదుర్గం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా కొనసాగిన వారంతా వర్గాలుగా గ్రూపులను విభజించి వాటిని ప్రోత్సహిస్తూ రాజకీయాలను నిర్వహిస్తూ వచ్చారు. కాలవ శ్రీనివాసులు మాత్రం ముందుగా 2014లో అతితక్కువ మెజార్టీతో గెలుపు సాధించి అభివృద్ధిని పరిచయం చేశారు. కర్ణాటక సరిహద్దులో ఉండే నియోజకవర్గం కావడంతో ఎక్కువ మంది వలసలు వెళ్లి జీవనం పొందేవారు. ఈనేపథ్యంలో అభివృద్ధి ఫలాలను అందించే దిశగా రూ.4500 కోట్లతో పనులు చేయించారు. శాశ్వతంగా నిలిచిపోయే పనులకు శ్రీకారం చుట్టేదిశగా కృషి చేశారు. అందులో భాగంగా బీటీపీకి కృష్ణాజలాలు అందించడం, లక్ష ఎకరాలకు సాగునీరు, ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం, ఫ్లైఓవర్‌లు, బాలికల జూనియర్ కళాశాల, బీసీ రెసిడెన్షియల్ కళాశాల లాంటి వాటితో పాటు వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి, రోడ్డు విస్తరణ లాంటి ఎన్నో పనులు చేసి కొత్త తరహా రాజకీయానికి తెరలేపారు. అయితే 2019లో జగన్ గాలిలో ఓటమి పొందినప్పటికీ ప్రస్తుతం వాటన్నింటిని మరచిపోయేలా ప్రజలు అత్యధిక మెజార్టీని అందించి అక్కున చేర్చుకున్నారు.

విజేతలకు అభినందనల వెల్లువ



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు అభినందన

బొమ్మనహాళ్, జూన్ 5: అనంతపురం పార్లమెంట్, రాయదుర్గం అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన అంబికా లక్ష్మీనారాయణ, కాలవ శ్రీనివాసులును మండల టీడీపీ నాయకులు బుధవారం కలిసి అభినందించారు. అనంతపురంలోని వారి నివాసాలకు మండలం నుండి టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. చంద్రహాస్, కొండాపురం కేశవరెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున, కుమ్మరి మల్లికార్జున, వాణిజగన్నాథరెడ్డి, యర్రగుంట్ల వెంకటేశులు, ఎస్‌పీ నాగరాజు, బలరాంరెడ్డి, ముల్లంగి నారాయణస్వామి, మహేంద్ర, మాలపాటి ధనుంజయ తదితరులు కాలవ శ్రీనివాసులును, అంబికా లక్ష్మీనారాయణలను కలిసి సత్కరించారు. ఉద్దేహాళ్, దర్గాహొన్నూరు, గోవిందవాడ, ఉంతకల్లు, క్రిష్ణాపురం తదితర గ్రామాల నుండి టీడీపీ నాయకులు, కార్య కర్తలు తరలి వెళ్లారు. పయ్యా వుల మోహన్, పయ్యావుల నాగరాజు, పయ్యావుల అని ల్, శీన, నవీన్, సంగప్ప, ప్రభు పాల్గొన్నారు.

కణేకల్లులో సైకిల్ జోరు

కణేకల్లు, జూన్ 5: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పల్లె నుండి పట్టణం వరకు సైకిల్ జోరు చూపడంతో మండలంలో 5253 ఓట్ల మెజార్టీ లభించింది. కణేకల్లు పట్టణంలో 18,055, మారెంపల్లిలో 12, గంగలాపురంలో 122, జక్కలవడికిలో 162, గెణిగెరలో 177, యర్రగుంటలో 118, బెణికల్లులో 262, బిదురకుంతంలో 193, ఉడేగోళంలో 103, నల్లంపల్లిలో 271, గోపులాపురంలో 362, కొత్తపల్లిలో 90, ఆదిగానిపల్లిలో 92, తుంబిగనూరులో 18, హనుమాపురంలో 245, నాగేపల్లిలో 377, మాల్యంలో 527, సొల్లాపురంలో 127, కళేకుర్తిలో 180, హనకనహాళ్‌లో 111 ఓట్ల మెజార్టీ టీడీపీ సాధించింది.

40 క్వింటాళ్ల కంది విత్తనాలు మంజూరు

రాయదుర్గంరూరల్, జూన్ 5: మండలానికి 40 క్వింటాళ్ల కంది విత్తనాలు మంజూరైనట్లు ఏఓ మహేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 74 ఉడేగోళం, ఆవులదట్ల ఆర్‌బీకేలకు చెరో రెండు క్వింటాళ్లు మంజూరు కాగా మరో 12 ఆర్‌బీకేలకు మూడు క్వింటాళ్ల ప్రకారం మంజూరు అయ్యాయన్నారు. నాలుగు కేజీల ఎల్ఆర్‌జీ 52 రకం విత్తనాలు ధర రూ. 390లుగా నిర్ణయించినట్లు తెలిపారు. కంది విత్తనాలు కావాల్సిన రైతులు తమ ఆర్‌బీకే కేంద్రాలలో రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉరవకొండ,జూన్5: వజ్రకరూరు మండలంలోని పీసీ ప్యాపిలి తండాకు చెందిన సక్రియా నాయక్ (42) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం పని నిమిత్తం సక్రియానాయక్ ఉరవకొండకు వచ్చారు. పని ముగించుకుని స్వగ్రామమైన పీసీ ప్యాపిలి తండాకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా, ప్యాపిలి బస్‌స్టాప్ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన అతడిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

పాముకాటుకు వ్యక్తి ...

బొమ్మనహాళ్, జూన్ 5: మండలంలోని ఉప్పరహాళ్‌లో పాము కాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. బంధువులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన తెలుగు దేవన్న(55) బుధవారం తెల్లవారుజామున ఇంటిలో నుండి బయటకు రాగా ఆవరణలో ఉన్న పాము కాటు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు కణేకల్లు క్రాసింగ్‌లోని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బళ్లారి విమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య చిత్తమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సేఫ్టీ సెమినార్

గుంతకల్లు, జూన్5: రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ట్రాక్ మెయింటెనర్లకు సేఫ్టీ సెమినార్‌ను నిర్వహించారు. బుధవారం ఉదయం పట్టణంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో డివిజన్‌లోని వివిధ ఇంజనీరింగ్ యూనిట్లలో పనిచేస్తున్న ట్రాక్ మెయింటెనెన్స్ కార్మికులు విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్మికులు తమ సమస్యలను వివరించారు. నైట్ పెట్రోలింగ్‌కు ఇద్దరు కార్మికులను పంపాలని, కాలంచెల్లిన టూల్స్‌ను మార్చాలని, తక్కువ నాణ్యత కలిగిన రెయిన్ కోట్‌లను రీప్లేస్ చేయాలని, పని స్థలంలో భోజనం కోసం, తాగునీటి కోసం విశ్రాంతి స్థలాలను ఏర్పాటుచేయాలని, తదితర సమస్యలను ఏకరువుపెట్టారు. కార్యక్రమంలో యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, సీనియర్ డీఈఎన్ కో-ఆర్డినేషన్ అక్కిరెడ్డి, యూనియన్ ఏడీఎస్ బీఎం బాషా, నాయకులు అశ్విని, శేఖర్‌బాబు, మస్తాన్ వలి, దేవరాజ్, రమేశ్, సుధాకర్, రామాంజులు రెడ్డి, రాజు, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

పెన్నహోబిలానికి పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ,జూన్5: ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ గెలుపొందడంతో మొండి సంఘం జిల్లా అధ్యక్షులు మారెన్న ఆధ్వర్యంలో ఉరవకొండ నుంచి పెన్నహోబిలానికి 16 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. ఉరవకొండ నుంచి పెన్నహోబిలానికి కాలినడకన బయలుదేరి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎమ్మెల్యే పేరిట ప్రత్యేక పూజలు చేశారు. కేశవ్‌ను మంత్రిగా చూడలననదే ఆకాంక్ష అని తెలిపారు. కార్యక్రమంలో శ్రీన, తిరుమలేష్, బాలరాజు, రాముడు, రవి, పాల్గొన్నారు.



గుత్తి కోర్టు అవరణలో మొక్కలు నాటుతున్న న్యాయ అధికారి



కళాశాలలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు(గుంతకల్లు టౌన్)



తాడిపత్రిలో పర్యావరణ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



కుందుర్పిలో ర్యాలీ నిర్వహిస్తున్న విలువలబడి విద్యార్థులు



మొక్కలు నాటిన అనంతరం మాట్లాడుతున్న న్యాయాధికారి సుభాన్(కళ్యాణదుర్గం)

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

గుత్తి, జూన్ 5: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మండల న్యాయ సేవ సమితి చైర్మన్, ఆరో అదనపు జిల్లా జడ్జి ఎం శ్రీహరి, స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథచారి పేర్కొన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో చెట్లను నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వీడీ రత్నం, ఏపీపీ బుసా సుధీర్‌రెడ్డి, న్యాయవాదులు శరత్‌చంద్ర, జాకీర్ హుసేన్, ఫక్రుబాషా కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని అటవి శాఖ సహకారంతో, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు.

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్కేపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, గుత్తిరేంజ్, నాగసముద్రం బీట్ ఫారెస్ట్ అధికారి రాజేశ్వరి, సూపరింటెండెంట్ మల్లికార్జునరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలు, సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామస్థులు గోవర్ధన్‌రెడ్డి, రామాంజి, సాంబ, పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని కృష్ణాపురంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ మాట్లాడుతూ మొక్కల పెంపకం ద్వారానే పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కుందుర్పి: రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కాలుష్యం నుంచి రక్షించుకోవడానికి మొక్కలు నాటడమే ఏకైక మార్గమని ఎస్కే చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు అన్నారు. సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం మండల వ్యాప్తంగా విలువలబడి వేసవి శిబిరాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు.

కళ్యాణదుర్గంరూరల్: పర్యావరణాన్ని పరిరక్షించుకుంటే జీవకోటికి అదే రక్షణ కల్పిస్తుందని స్థానిక జూనియర్ జడ్జి బండి సుభాన్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులతో మొక్కలను నాటించారు. ప్రకృతి ప్రసాదించిన సంపదలను మానవుడు తన స్వలాభం కోసం చెట్లను నరకడం, ఇసుకను అక్రమ రవాణా చేయడం, ఖనిజసంపదను దోచుకోవాడం వంటివి చేయడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరి చక్రవర్తి, న్యాయవాదులు దేవేంద్రప్ప, కే మల్లికార్జున, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాలు, స్థానిక అటవీశాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నారాయణ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా 150 మొక్కలను నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆంజనేయులు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది విశ్వనాథ్, గోపాల, రవి, అధ్యాపకులు వినోద్‌కుమార్, రఘు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న అధికారులు, విద్యార్థులు (రాయదుర్గం)